# నిడదవోలు

శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మ

ఎటుచూసినా సుమారు రెండు మైళ్లు వైశాల్యం గల పాటి నేలలతో - పల్లె పట్టులతో కూడుకొని వున్న నేటి నిడదవోలు - పన్నెండవ శతాబ్దిలోనూ - ఆ పిమ్మటా - వరుసగా - 'నిరవద్యపురము', 'నిడుదప్రోలు'అని వ్యవహరింపబడుతూ వుండేది. శ్రీ మంగిపూడి వేంకటశర్మగారు తమముద్దుకతలో —

"నిరవద్య పురమను నిడదవోలునకు
మిగుల చెంగటనున్న రావిమెట్ట గ్రామమున"

అన్నారు.

నేడీగ్రామానికి తూర్పున పెద్దమడుగూ- పడమర ఎత్తైన కోటదిబ్బా - దాని పూర్వపు ఔన్నత్యాన్నిప్పటికీ వెల్లడిస్తున్నాయి. అంతేకాదు - దీని చుట్టూగల జలసీమ (జల్లి), బత్తర్ - బహార్ సీమలూ, దండుబాట, దండుకర్రలూ, ద్వారవరం (దారారంగ్రామం - ఇచ్చటే కోట ముఖద్వారం వుండేది అంటారు) రాజధానీ నగర చిహ్నాలనకతీరదు. కాగా - కోటదిబ్బలో శివలింగాలూ, శివాలయాలూ, శక్తి విగ్రహాలూ (వీటిలో ఒకదానికి పూజాదికాలిప్పుడు జరుగుతున్నాయి.) మున్నగునవి బయలు పడడాన్ని పట్టి- క్రీ. శ. ౧౨౬౦ లగాయతు ౧౩౨౬ వరకూ పురుషవేషంతో ఆంధ్రమహా సామ్రాజ్యాన్నేకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించిన కాకతీయ రుద్రమదేవికిది ప్రాంతీయ రాజధానీనగరమైనట్టు స్పష్టమవుతూ వుంది. ఇచ్చటామె చాళుక్య వీరభద్రుని వివాహమాడి రుయ్యాంబను కన్నట్టు కూడా జనశ్రుతి.

కాలవశంవల్ల క్రమక్రమంగా అటు కాకతీయ పరిపాలనా - ఇటు చాళుక్యపరిపాలనా క్షీణదశకు వచ్చాక - దేశంలో అనేక చోట్ల మొహమ్మదీయులు చొరబడ్డారు. అనేక నగరాలు వారి హస్తగతమయ్యాయి. అలాగే నిడదవోలుకూడా అయింది. కొవ్వూరుకు రెండు మైళ్ళ దూరంలో ఔరంగాబాదు, చాగల్లు సమీపంలో మీనా నగరం మున్నగు గ్రామాలు తురక పేరులతో ఇప్పటికీ వుండడమే ఇందుకు తార్కాణ.

అయితే - ఈ నగరాన్ని పట్టుకుని రాచరికం చలాయించిన మొహమ్మదీయు

లెవరో తెలియదుకాని - వీర పరిపాలనా ప్రభావాన్ని వెల్లడించే శ్లోకమొకటి అక్షరాస్యులలో వాడుకలోవుంది—

"విప్రాస్మిన్ నగరే మహాన్ కథయకః ?
  తాళ ద్రుమా ణాంగణః,
కోదాతా ? రజకో దదాతి వసనం
  ప్రాతర్గృహీత్వానిశి,
కో విద్వాన్ ? పరదార విత్తహరణే
  సర్వేపి విద్వత్తమాః,
కస్మా జ్జీవసి హేసఖే !
  విషక్రిమి న్యాయేన జీవామ్యహమ్"

కాగా - ఈ నగర పరిపాలకులయిన తురకలు రాతిరి పగలూ - పగలు రాతిరీ చేసి వ్యవహరిస్తూ వుండేవారట ! ఆ కాలంలో ధాన్యాది కొలతలో తగవుపడిన ప్రజకు - కుంచంబోర్లించీ - అడ్డుగా పెట్టీ కొలవవలసిందిగా వారు శాసించారనేటటువంటి గాథలెన్నో ప్రచారంలో వున్నాయి.

అప్పుడొక బ్రాహ్మణుడు భార్యతోనూ, ఇద్దరు పిల్లలతోనూ మార్గవశాత్తూ మధ్యాహ్నానికి ఆ నగరానికి చేరాడట. నగరాని కప్పుడర్థరాత్రి కావడం వల్ల గాఢ నిద్రలోవుంది. వీథులు నిర్మానుష్యంగా వున్నాయి. పట్టపగలు ఎండ తీవ్రంగా వుంది. కాళ్ళు కాలిపోతున్నాయి. దీపాలు మాత్రం వెలుగుతున్నాయి. బజారులేదు. అందుకు వారు వింతపోతూ వంట సామగ్రికోసం నగరమంతా గాలిస్తూ వున్నారు. దివ్యకాంతలాగు అతిలోక సౌందర్యంతో ప్రకాశిస్తూవున్న ఆ బ్రాహ్మణుని భార్య - అంతఃపురంలో పచారు చేస్తూవున్న పాదుషా కంట పడింది. అలా చూసీ చూడగానే అతడామెను తీసుకు రమ్మని భటుల కాజ్ఞాపించాడు.

భటు లావెంటనేపోయి వారిని చుట్టుముట్టారు. బ్రాహ్మణుడా భటుల్ని ఎదుర్కొన్నాడు. అతనితో వారికి చాలా సేపు పోరాటం జరిగింది. ఆ పోరాటంలో భటులెందరో హతమయ్యారు. కాని - భటుల సంఖ్య అధికమైంది. సాయుధ భటులతో నిరాయుధుడైన బ్రాహ్మణ వీరు డెంతకాలం పోరాడగలడు? అలా అలసిపోయిన బ్రాహ్మణుని భటులు పట్టుకుని చింతచెట్టుకు జార్లవేసి - మేకులు వేసి - కొట్టి చంపారు. ఈ చెట్టు 'వీరుని చింత' అనే పేరుతో చాగల్లుకుపోయే ట్రంకు రోడ్డులోవుంది. ( ఆచింత లేదుగాని దాని స్థానే మరొక చెట్టూ - అక్కడకొన్ని శిలా ప్రతిమలూ ఇప్పటికీ ఉన్నాయి)

అలా మగని మరణం కళ్ళారా కాంచిన ఆ బ్రాహ్మణి - ఆ భటులకు భయపడి పిల్లలను చంకపెట్టుకొని ఇండ్ల పెరటి దొడ్డులలోనుండి గోడలూ గొందెలూ దాటుకుంటూ పోయిపోయి మానభంగం కాకుండా మడుగులో పడి మాయమయింది. అలా మాయమైన ఆమె నేటి గ్రామదేవత.

గ్రామ దేవత నంగాలమ్మ చంకలలో పిల్లలతోటి శిలా ప్రతిమ మడుగు ఒడ్డున పెంకుటి గదిలో మన కవుపిస్తుంది. ఆమెకు దేవాలయ మంటూ లేదు. జాతర సమయాలలో ఆమె ఎవరికో వకరి కావేశించి ఏడవటం తప్పితే ఏమీ చెప్పదు.

మాన సంరక్షణార్థం నంగాలమ్మ మడుగుకు పోయేటప్పుడు గోడల మదుళ్ళకామె చీర తగులుకొని-చాలా ఇబ్బంది కలిగించడంవల్ల - గోడలకు మదుళ్ళుండరాదనీ - తన మగని మరణానికి చింత చెట్టు కారణమైనందున చింతలు కాయకూడదనీ శపించిందట! అలాగే అక్కడి చింత లిప్పటికీ కాయవు; గోడలకు మదుళ్ళుండవు.

ఆపత్కాలంలో నంగాలమ్మను ఆదుకుని - ఆశ్రయమిచ్చి - అవకాశమున్నంతసేపు ఆదరించినవారు - 'వంగా' వారట. వంగావారు కాపులు. ఈ కాపులామెకు పుట్టింటి మర్యాదలన్నీ ఉత్సవసమయాలలో జరుపుతూవుంటారు. అందుకామె సంతోషిస్తూ గ్రామ సంరక్షిణిగావుంది.

రీటా హెయిర్ టానిక్



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి నిగనిగలాడు నిడుపాటికురులను పెంచే అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెంట్రుకలు రాలుట, చుండు, బట్టతల మొదలైన కురుల వ్యాధులకు రీటా అమోఘమైనది. మీరుకూడ నేటి నుండియే రీటా వాడుడు. ప్రతిచోటా దొరుకును.




RITA
HAIR TONIC